విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

మంచి పాలను వినియోగదారులకు సరఫరా చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర - లింగపాలెం : వినియోగదారులకు మంచి పాలను సరఫరా చేయటానికి, ఉత్పత్తిదారులకు అధిక ధరను ఇచ్చేందుకు జగనన్న పాల వెల్లువను ప్రభుత్వం ప్రవేశపెట్టిం దని, దీనిని వినియో గించు కోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. లింగపాలెం మండలంలో అమూల్ ద్వారా పాల సేకరణలో భాగంగా 20వ రూట్ ప్రారంభించేందుకు కలెక్టర్‌తో పాటు జెసి అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీసీఓ ప్రవీణా లింగపాలెం వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని పాచ్చానగరంలో ఇటీవల కల్తీ పాల సంఘటన వెలుగులోకి రావటంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలానికి తాను స్వయంగా వచ్చానని తెలిపారు. ఇటువంటి కల్తీ పాల వ్యాపారాలను నిరోధించే చర్యల్లో భాగంగా అమూల్ పాల వెల్లువను ప్రోత్సహిస్తు న్నామని అన్నారు. గుజరాత్‌లో దాదాపు 50 ఏళ్ళ క్రితం అమూల్ పాల సొసైటీ ప్రారంభమై ఇప్పుడు దేశమంతా విస్తరించిందని పేర్కొన్నారు. జిల్లాలో పాల వెల్లువ ద్వారా తొమ్మిది వేల లీటర్లు ప్రారంభంలో సెప్టెంబరుకు సేకరించామని, ఇప్పుడు 15 వేల లీటర్లకుపైగా ప్రతీరోజూ సేకరిస్తున్నట్టు తెలిపారు. దీనిని 20 వేల లీటర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్టు వివరించారు. పాల వెల్లువకు పాలు ఉత్పత్తి చేసే వారికి అంతా సక్రమంగా ఉంటే లీటరుకు రూ. 82లు వస్తుందని తెలిపారు. ఉత్పత్తిదారులకు, పాల సేకరణ చేసే ప్రమోటర్లకు, సంఘాలకు రాయితీలు ఉంటా యని వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఓ ఆశీర్వాదం, అమూల్ కంపెనీ ఉద్యోగులు, జడ్పీటిసి హరినాథ్‌రాజు, మండల వైసీపీ అధ్యక్షులు ముసునూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం తనిఖీ

విశాలాంధ్ర - లింగపాలెం : ధర్మాజీగూడెంలోని ఉన్నత పాఠశాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ ఈ పాఠశాలకు వెళ్ళారు. ఆ సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండటంతో భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆకు కూర తక్కువగా వండటంపై వంట తయారీదారులను ప్రశ్నించారు. ఇది ఎక్కువగా విద్యార్థులు తినటంలేదని చెప్పటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం వంట చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పాఠశాలలో భోజనం చేశారు. వంట బాగా చేశారని అభినందించారు. ఈయనతోపాటు జెసి అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ భోజనం చేశారు. విద్యార్థులతో పాటూ అధికారులు భోజనం చేశారు. కలెక్టర్ రాకను తెలుసుకుని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని హుటాహుటిన వచ్చారు. ఈమెకు పలు సూచనలు చేశారు.

దివ్యాంగులకు ప్రోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర - లింగపాలెం : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ధర్మాజీగూడెం భవిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ ప్రోత్సాహక బహుమతులను, పాఠశాలకు అవసర మైన సామాగ్రిని అందించారు. దివ్యాంగు లలో మనోస్థైర్యం నింపేందుకు ప్రతీ ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

విశాలాంధ్ర - కలిదిండి: ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి చెందినట్లు ఎస్సై మణికుమార్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని పోతుమర్రు గ్రామంలో శుక్రవారం సాయంత్రం బోయిన కార్తీక్ (4) ఇంటి ముందు ఆడుకుంటుండగా ఏపీ 26 టిసి 2961 నెంబర్ గల ట్రాక్టర్ ఢీకొనడంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి బోయిన తేజ ఇచ్చిన ఫిర్యాదు పై మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విజేతలకు బహుమతి ప్రదానం

విశాలాంధ్ర-ఉంగుటూరు : పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీరడమే ధ్యేయంగా సాయి యువసేన చిన్నారులకు పద్య పఠన, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కైకరంలో స్థానిక విజ్ఞాన భారతి. పాఠశాల శనివారం విద్యార్థులకు శపద్యధారణ, ప్రహేళికపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్య విద్యాసాగర్ శర్మ, పాఠశాల కరస్పాండెంట్. కొచ్చర్లకోట శ్రీనివాస్ , సాయి యువ యువసేన ఉపాధ్యక్షుడు జె.జగన్నాయకులు కొచ్చర్ల కోట శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అనంతరం బహుమతులు పంపిణీ చేశారు.

రైస్ మిల్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - గణపవరం: గ్రామీణ ప్రాంతంలో సత్యనారాయణ రైస్ అగ్రో ఇండస్ట్రీ ఏర్పాటు చేయడం వలన కార్మికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని, వరి పండించే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు (రంగరాజు) అన్నారు. శనివారం గణపవరం మండలం మొయ్యరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సత్యనారాయణ రైస్ అండ్ అగ్రో ఇండస్ట్రీ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) మాట్లాడుతూ ఈ ఇండస్ట్రీ వలన ప్రజలకు కార్మికులకు రైతులకు ఎన్నో ప్రయోజ నాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ అగ్రో ఇండస్ట్రీ యజమానులు యర్ర సత్యనారాయణ,చిన సుబ్రహ్మణ్యం, యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

పొలంలో బంగారు నాణేలు లభ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రైతు పొలంలో మట్టి పిడతలు, బంగారు నాణెములు లభ్యం అయిన సంఘటన కొయ్యలగూడెం మండలం ఎర్రంపేట గ్రామపంచాయతీ పరిధి ఏడువాడాలపాలెంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ పి. నాగమణి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం ఏడు వాడాల పాలెం గ్రామానికి చెందిన మానుకొండ తేజస్వి పొలంలో 17 బంగారు నాణెములు, మట్టి పిడతలు లభ్యమయ్యాయని తెలిపారు. గత నెల 29వ తేదీన మానుకొండ వీర వెంకట సత్యనారాయణ పొలములో ఆరుగురు కూలీల సహాయంతో పైపులైను వేయుటకు గాడి తవ్వుతుండగా 18 బంగారు నాణెములు గల పిడత వెలుగులోకి వచ్చిందన్నారు. సమాచారాన్ని మానుకొండ వీర వెంకట సత్యనారాయణ తమకు తెలియజేయడంతో వాటిని తూకము వేయించగా 61 గ్రాముల 720 మిల్లీ గ్రాములు బరువుగా గుర్తించామన్నారు. వీటిని జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వారి నుండి ఉత్తర్వులు వచ్చే వరకు భద్రతా నిమిత్తం జిల్లా ట్రెజరర్ వారికి అందజేయడం జరుగుతుందని తహసీల్దార్ పి.నాగమణి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ మణి దివ్య, డిప్యూటీ తహసీల్దార్ , సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ షాక్
విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ షాక్ ఇచ్చేందుకు సమాయత్తం అవుతోంది. ఆర్ డి ఎస్ ఎస్ పథకం కింద డిస్కం పరిధిలో 2025 నాటికి దశలవారీగా ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు దిశగా అడుగులు వేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రీపెయిడ్ విధానం త్వరలో అమలులోకి రానున్నది. విద్యుత్ కోసం ముందుగా రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే విద్యుత్ సరఫరా అవుతుంది. లేకుంటే విద్యుత్ కట్. ఇందుకోసం ప్రతి వినియోగదారుడు తప్పనిసరిగా ప్రీపెయిడ్ మీటర్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ ఉంటేనే ఇంటికి విద్యుత్ సరఫరా కానుంది.కేంద్ర ప్రభుత్వం ఆధయానంలోని రీవాంపడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టం ఈ ప్రీపెయిడ్ విధానాన్ని తీసుకొచ్చింది. అమలు చేయాలని డిస్కం ల వారీగా విద్యుత్ శాఖ కు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విధానం కింద అన్ని విద్యుత్ లైన్లలో ముందుగా నష్టాలు లేకుండా చూస్తారు. ప్రతి లైన్‌కు మీటర్లు బిగిస్తారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నుంచి వెళ్లే అవుట్ పుట్ లో మీటర్లు బిగించి దాని నుంచి ఎంత విద్యుత్తు ఖర్చు అవుతుంది, దానికి తగ్గట్టుగా బిల్లు ఎంత రావాలి, ఒకవేళ తక్కువగా వస్తే అందులో నష్టం ఎక్కడ జరుగుతుందో వెంటనే గుర్తిస్తారు. విద్యుత్ సబ్ స్టేషన్ లో నూ మీటర్లు బిగిస్తారు. ఎన్ని యూనిట్లు ఖర్చు అయితే దానికి తగ్గట్లుగా బిల్లు రావాలి. సరఫరా అయ్యే విద్యుత్తు సరిపడా బిల్లు రాకుంటే రాబోయే రోజుల్లో అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుంది. విద్యుత్ శాఖ అందించిన వివరాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 లక్షల 44 వేల 798 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహ వినియోగదారులకు 12 లక్షల 36వేల 670, వ్యవసాయ కనెక్షన్లు 1 లక్ష 2 వేల 367 పరిశ్రమలకు 5వేల 165, వ్యాపార సంస్థలకు 1 లక్ష50 వేల347 ఆక్వాకు సంబంధించి 21 వేల43 కనెక్షన్లు ఉన్నాయి.త్వరలో రాబోయే ప్రీపెయిడ్ విధానం వల్ల ప్రతినెల రీడింగ్ తీయడం, ఇంటింటికి వెళ్లి బిల్లులు ఇవ్వడం వంటివి ఇకముందు ఉండవు. మొబైల్‌కు సందేశాలు వస్తాయి. వాటి ద్వారానే ముందుగా బిల్లు చెల్లించాలి. గ్రామీణ ప్రాంతాలలో మొబైల్ సౌకర్యం లేని వారి కోసం బిల్లులు స్వీకరించే కార్యాలయాలు యధావిధిగా కొనసాగుతాయి. అక్కడ బిల్లులు చెల్లించి రీఛార్జ్ చేసుకోవచ్చు. కొత్త మార్గదర్శకాలను పకడ్బందీగా అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు వ్యవసాయ మోటార్లకు సైతం మీటర్లు బిగిస్తారు. ప్రతి ఇల్లు, సంస్థ, పరిశ్రమ, ప్రభుత్వ కార్యాలయాలు, నీటి సరఫరా ఇలా ఏదైనా కొనసాగుతుంది. నూతన విధానం అమలుకు సన్నాహాలు మొదలయ్యాయి. ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు రాష్ట్రాల అనుమతి అవసరం లేదు. ఈ మేరకు ఈ ఆర్ సి లు ఉత్తర్వులు జారీ చేస్తాయి. డిస్కం లు వెంటనే అమలు చేయాల్సి ఉంటుంది. గడువులోగా ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయకుంటే కేంద్రం డిస్కంలకు గ్రాంట్లను నిలిపివేస్తుంది. కార్డుపై రీఛార్జ్ చేసిన నగదు అయిపోగానే విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ఇప్పటికే పెట్రోల్ ,డీజిల్ ధరలకు రెక్కలు రావడంతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్ భారం గోరుచుట్టుపై రోకలి పోటులా మారనుంది.

ప్రత్యేక కౌంటర్లు, రీఛార్జి కూపన్లు

నగదు చెల్లించడమే కాకుండా రీఛార్జ్ కూపన్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు. రూ.1000 నుంచి రూ. 20 వేల వరకు కూపన్లను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అందిస్తారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలలో ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లను అమర్చుతారు. ప్రభుత్వ కార్యాలయాలలో విద్యుత్ బకాయిలు రూ. కోట్ల బకాయిలు నిలిచిపోతున్న విషయం విధితమే. ప్రీపెయిడ్ మీటర్ల ద్వారా పరిష్కారం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. కూపన్లను ప్రభుత్వ కార్యాలయాలు ముందుగానే కొనుగోలు చేయాలి.

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి
- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం : విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలను స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వస్తున్న విభిన్న ప్రతిభావంతుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఈ శాఖ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారి నీలకంఠ ప్రధాన్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. వెంకటరమణ, జిల్లా సర్వశిక్ష అభియాన్ ఏపీసీ పి.శ్యాంసుందర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతుల వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

6న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర- ఏలూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశం ఈనెల 6 మంగళవారం మధ్యాహ్నం గం.2లకు విజయవాడలో బికెయంయు రాష్ట్ర కార్యాలయం దాసరి భవనంలో జరుగుతుందని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు కె. రామకృష్ణ, బికెఎంయు జాతీయ కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియ పాల్గొంటారని బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో భూ సమస్యలు, ఉపాధి హామీ పనులు, సంఘ సభ్యత్వం, గ్రామ సంఘాల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న బికెఎంయు రాష్ట్ర సమితి సభ్యులు నిర్ణీత సమయంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలు

విశాలాంధ్ర- తణుకు :17సంవత్సరాల సుదీర్ఘమైన అనుభవంతో దేశంలోనే పేరు పొందిన తయారీదారుల నుండి నాణ్యమైన వస్త్రాలను వినియోగ దారులకు అందిస్తున్నామని ఎస్. ఆర్ షాపింగ్ మాల్ జాయింట్ ఎండి డాక్టర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక చిట్టూరి హెరిటేజ్ హోటలులో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2005వ సంవత్సరంలో విశాఖపట్నంలో మొదటిగా ప్రారంభించిన ఎస్. ఆర్ షాపింగ్ మాల్ ఎప్పటికప్పుడు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా లేటెస్ట్ వెరైటీస్, లేటెస్ట్ ట్రెండ్స్ కి అనుగుణంగా అతి తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు. ఆదివారం తణుకు పట్టణంలో మా సంస్థ 10 వ బ్రాంచ్ ను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రారంభిస్తున్నారని, సినీ హీరోయిన్ ప్రజ్ఞా జైస్వాల్ (అఖండ ఫేమ్)చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాబోవు పండుగల సందర్భంగా కుటుంబంలో ప్రతీ ఒక్కరికి సరిపడ ఆఫర్స్ తో పాటుగా రూ.కోటి విలువైన బహుమతులు అందిస్తునామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఆర్ షాపింగ్ మాల్ తణుకు బ్రాంచ్ మేనేజర్ బాలు, వైస్ ప్రెసిడెంట్ వి. పూజారి, డైరెక్టర్ (పర్చేజ్)శివ కేశవ రెడ్డి, ఏరియా మేనేజర్ రామ్మోహన్ రెడ్డి, మేనేజర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేందుకే శాశ్వత భూ హక్కు పథకం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : రైతులకు మేలు చేసేందుకే ముఖ్యమంత్రి జగన్ వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే గ్రంధిశ్రీనివాస్ అన్నారు. ఈ పథకానికి సంబంధించి నియోజకవర్గంలో పైలట్ గ్రామాలుగా భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం, వీరవాసరం మండలంలోని నేల పోగుల గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ క్రమంలో శనివారం ముందుగా కొవ్వాడ అన్నవరం గ్రామం, నేలపోగుల గ్రామంలో రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, తహసీల్దారులు వై. రవికుమార్, ఎం.సుందర్రాజు, ఇన్‌చార్జి ఎంపీడీవోలు రామచంద్ర ప్రభు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో ఒంగోలులో జరిగే ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర కోశాధికారి కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్స్ ను భీమవరంలో మహిళా కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు పని భద్రత, పనిభారం పెంపు, అపరిష్కృత సమస్యలు, చాలీచాలని వేతనాలు, అప్కోస్ లోపభూయిష్టమైన విధానాలు వీటిపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ పోరాటాలకు మహాసభల్లో దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. యావత్ కార్మికులోకం మహాసభలను విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కిలారి శివ, దుర్గారావు, బంగారు శివ, నీలాపు శ్రీను, దుర్గారావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

5న తహసీల్దార్ కేంద్రాల వద్ద ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చింతలపూడి రూరల్ : ఈనెల 5న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రేచర్ల, కొమ్ముగూడెం గ్రామాలలో జగనన్న కాలనీలను సీపీఐ మండల ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలకు ఇచ్చే రూ.1 లక్ష80వేలు ఇంటి నిర్మాణానికి సరిపోయే పరిస్థితి లేదన్నారు. పెరిగిన మెటీరియల్ ధరలకు అనుగుణంగా కనీసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 5న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో లబ్ధిదారులు, సీపీఐ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బృందంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి లు పుల్లూరి సోమశేఖర్,తొర్లపాటి బాబు, సీపీఐ మండల నాయకులు ఇ. వెంకటేశ్వరరావు, దొంతా తిరుపతయ్య, బొక్క రాఘవ పాల్గొన్నారు.

ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఏలూరు : ఈనెల7,8, తేదీలలో ఒంగోలులో జరగబోయే ఎపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు పిలుపునిచ్చారు. స్థానిక కోట దిబ్బ వద్ద మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అప్పల రాజు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ కార్మికులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26 వేలు జీతాలు చెల్లించాలన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ సిబ్బందికి బకాయి ఉన్న డీఏ లు చెల్లించాలన్నారు. బకాయి పడిన సరండర్ లీవ్ తక్షణం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటి, కార్పోరేషన్లలో ఖాళీ పోస్టులలో పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలులో జరిగే మహాసభలలో సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్ కె. ఆలీ, మీసాల శ్రీను, ఎస్ ఎంవి సుబ్బారావు,వెంకట్, అశోక్,శ్రీను, ఎన్‌కె అక్బర్ సాబ్, టి. రామారావు, రంగారావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 4వరాష్ట్ర మహాసబలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - తణుకు : ఈనెల 7,8 తేదీల్లో ఒంగోలులో జరుగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఎఐటియుసి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు కోరారు.శనివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నందు భూపతిరాజు సుబ్బరాజు సమావేశ మందిరంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ మహాసభలు సందర్భంగా 7 న ఒంగోలు నగరంలో జరుపతలపెట్టిన కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నుంచి మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, తదితర సమస్యలు పరిష్కారానికి మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షులు బొద్దాని నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కారానికి,సమానపనికి సమానవేతనం, హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని,ఆప్కాస్ విధానం రద్దు చేయాలని తదితర న్యాయ డిమాండ్ ల సాధనకు మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి,పట్టణ కమిటీ సభ్యులు బొద్దాని మురళి కృష్ణ, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు మందుల ముత్తయ్యగెడ్డం వెంకటేశ్వరరావు, బంగారు నూకరాజు,మందుల లక్ష్మి,నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణంలో ప్రభుత్వ విఫలం

విశాలాంధ్ర-కామవరపుకోట: జగనన్న కాలనీల నిర్మాణంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు విమర్శించారు. మండలం లోని తాడిచర్ల గ్రామంలో నిర్మా ణంలో ఉన్న జగనన్న కాలనీలను సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలిం చింది. ఈ సందర్భంగా టీవీఎస్ రాజు మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేయాల్సిన భూమి భూస్వాములు వేల ఎకరాలు దోచుకుని నిరుపేదలు సాగు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం అన్నారు. ఊరికి దూరంగా ఇళ్లు ఇవ్వడం వలన లబ్ధిదారులు ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1 లక్ష 80 వేలు ఏమాత్రం సరిపోదన్నారు. తక్షణమే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ముఠావర్కర్ సీనియర్ నాయకులు కోడిగంటి సోమరాజు, ఏలూరి ప్రసాద రాజు, యనం శెట్టి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సరస్వతి, నాగ శేషం రాజు, నల్లమోతుల కృష్ణ, అమృతలూరు సాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరు పూర్తిగా అందిస్తాం
ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విశాలాంధ్ర - భీమవరం : జిల్లాలో ఉన్న 3,78,745 ఎకరాల ఆయకట్టుకు నూరు శాతం నీరు అందిస్తామని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశానికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలువలు, డ్రైన్‌లలో చేయవలసిన పనులు కాలువలు మూసివేత సమయంలో ఖచ్చితంగా పూర్తిఅయ్యేలా ప్రణాళిక రూపొందించి, పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుత సంవత్సరం జల వనరుల శాఖ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న పనులకు కాంట్రాక్టర్లు ఎందుకు ముందుకు రావడం లేదో ఆలోచించి దానికి పరిష్కారం మార్గం చూడాలన్నారు. డ్రైన్లలో 46 పనులు మంజూరు అయితే 3 పనులు మాత్రమే పూర్తిఅయ్యాయని, 43పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.2020 - 23 రబీ పంట అనంతరం కాలువ వచ్చే సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీన మూసివేయడం జరుగుతుందన్నారు. తిరిగి జూన్ 1న కాలువలు తెరవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి మాట్లాడుతూ టైల్యాండ్ లో ఉన్న కొన్ని మండలాలకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పనులు ప్రతిపాదనలు పంపేటప్పుడు లేటుగా పంపిస్తున్నారని, త్వరితగతిన పంపించి అనుమతులు వచ్చిన వెంటనే పనులకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచిం చారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు ఆధునికీకరణ పనులు చేపట్టాలని జిల్లా కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింటు కలెక్టరు జేవీ మురళి, జిల్లా ఇన్‌చార్జి డిఆర్ఓ దాసి రాజు, జల వనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారి పి. నాగార్జునరావు, ఈఈలు, డిఈలు, ఏఈలు ,ఇతర జిల్లా అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ ఇళ్లకు రూ.5 లక్షలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ వ్యయం రూ.5లక్షలు మంజూరు చెయ్యాలని సీపీఐ మండల కార్యదర్శి జెవి.రమణ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మార్కండేయపురం సమీపంలోని వెంకటదేవిపురం లో నిర్మితమవుతున్న జగనన్న కాలనీల ఇళ్లను సీపీఐ నాయకులు సందర్శించారు. ఇళ్ల నిర్మాణం చేసుకుంటున్న లబ్ధిదారు లను సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జె.వి.రమణ రాజు మాట్లాడుతూ పట్టణాల్లో సెంటు స్థలమిచ్చి పేదలకు ఇళ్ళు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వానికి రూ.1లక్షా 80వేలతో ఇంటి నిర్మాణం సాధ్యం కాదన్నారు. మెటీరియల్ ధరలు పెరగడంతో నిర్మాణ వ్యయం పెరగడం,ఊరికి దూర ప్రాంతం కావడంతో రవాణా చార్జీలు అధిక మవ్వడం, విద్యుత్ ,నీటి సదుపాయం కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు, మండల కమిటీ సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, గొలిమే బాలయేసు, తాళ్లూరి నాగరాజు, శీనయ్య, హనుమంతు, శ్రీనివాసరావు, సాంబయ్య, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ప్రభుత్వం అందించే ఉపకరణాలు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: దివ్యాంగులు ప్రభుత్వం అందించే ఉపకరణాలు వినియోగించాలని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జివి ప్రభావతి దేవి తెలిపారు. స్థానిక భవిత స్కూల్ లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మండల ప్రత్యేక ఉపాధ్యాయుడు జె. శ్రీను ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభావతి దేవి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందించే స్కాలర్ షిప్, ఎలవెన్సులు,ఉపకరణాలు వినియోగించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు కె వీరాస్వామి, మండల ఫిజియోథెరపిస్టు ఎం. శ్రీనాద్,ఉపాధ్యాయులు ఎన్. నాగలక్ష్మి,ఎన్. భవాని, భార్గవి, బి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దోమకాటుకు గురి కావద్దు

విశాలాంధ్ర - గణపవరం: హాస్టల్లో చదివే విద్యార్థులు దోమల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అన్నారు. శనివారం గణపవరం పీహెచ్ సి పరిధిలోని ఎస్సీ బాలురు, బాలికల హాస్టల్లో దోమల నివారణ నిమిత్తం రెండు వసతి గృహాల్లో వైద్యాధికారి ఆధ్వర్యంలో దోమల నివారణకు క్రిమిసంహారక మందు స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ అధికారి జె.విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు ఎంఎస్ యోహాన్, జి. శ్రీనివాస్, ఏఎన్ఎం ఐ. జేయమ్మ, ఆశా కార్యకర్తలు, హాస్టల్ వార్డులను, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రాగునీరు కొరత లేకుండా చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చడం కోసం త్రాగు నీటి కొరత లేకుండా మంచినీటి ట్యాంకులు, ఇంటిం టికి కుళాయి ప్రవేశ పెట్టినట్టు పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండ లంలో బోడిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకుకు గ్రామపంచాయతీ సర్పంచ్ కడకట్ల గడ్డియ్యతో కలిసి, శాసనసభ్యులు తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 170 గ్రామాలకు రూ. 43 కోట్ల నిధులతో మంచినీటి ట్యాంకులు, ఇంటింటికి కుళాయి నిర్మిస్తున్నామ న్నారు. రానున్న వేసవికాలంలో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండాలని ఆకాంక్షతో జేజేఎం నిధుల ద్వారా మంచినీటి ట్యాంకులు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి,బయ్యానగూడెం గ్రామ పంచాయితీ సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, వసుబోయిన సత్యనారాయణ,మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఉదయ్ కుమార్, గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

6న లౌకిక వ్యవస్థ పరిరక్షణ సదస్సు

విశాలాంధ్ర - ఏలూరు : ఈనెల 6వ తేదీన మంగళవారం ఉదయం గం.10లకు విజయవాడలో రాఘవయ్య పార్కు వద్ద గల ఎంబీ భవనంలో భారతదేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3, 6 అంబేద్కర్ వర్ధంతి, బాబ్రీ మసీదు కూల్చిన రోజు పురస్కరించుకొని భారతదేశ లౌకిక వ్యవస్థ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుందని,సదస్సులో లౌకిక వ్యవస్థ పరిరక్షణ వేదిక నాయకులు, వామపక్ష నాయకులు, వివిధ ప్రజా సంఘ నాయకులు, లౌకికవాదులు పాల్గొంటారని తెలిపారు.

మహిళ అదృశ్యం పై కేసు నమోదు

విశాలాంధ్ర - నూజివీడు టౌన్: మహిళ అదృశ్యంపై నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ లో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి. రామకృష్ణ తెలిపారు. మండలంలోని తుక్కులూరుకు చెందిన కంభంపాటి ప్రమీల రాణి శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తారని చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళా ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్‌కు కానీ, ఎస్ఐ సెల్ నెంబర్ 9440796440 తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు.

బీసీ మహాసభను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - నిడమర్రు : విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 7వ తేదీన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జయహో బీసీ మహా సభను జయప్రదం చేయాలని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. సభ నిర్వహించనున్న సందర్భంగా జయహో బీసీ మహా సభ-వెనుకబడిన కులాలే వెన్నెముక అన్న నినాదంతో బీసీ మహా సభ పోస్టర్ ను శనివారం నిడమర్రు మండలం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బి.సి నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ బీసీ ఉపకులాల రాజకీయ సాధికారతకు కృషిచేసిన ఏకైక నాయ కుడిగా ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, సరిపల్లి సర్పంచ్ చనుమూరి లక్ష్మీ భవాని, వైఎస్ఆర్ పార్టీ నాయకులు చనుమూరి శివ, రొంగల శ్రీను, శెట్టి త్యాగరాజా, నిడమర్రు గణపవరం మండలాల బీసీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈయన మండల పర్యటనలో భాగంగా అక్రమ మట్టి తవ్వకాలపై జెసి అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో మాట్లాడారు. దీనిపై గట్టి నిఘా పెట్టాలని వీరంతా నిర్ణయించారు. అక్రమ తవ్వకాలను నిరోధించే బాధ్యతను కలెక్టర్ సబ్ కలెక్టర్‌కు అప్పగించారు. పోలీసులను అప్రమత్తం చేస్తామని కలెక్టర్ తెలిపారు. అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలపై ప్రజలు అప్రమత్తతతో ఉండి తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

మానసిక వికలాంగులను ఆదరించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : వికలాంగులను మానసిక వికలాంగులను కనికరించి వికలాంగుల విద్యకు ప్రభుత్వ సహకారం అందించాలని పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా కొయ్యలగూడెం లోని వికలాంగుల హాస్టల్, స్కూలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వికలాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ వికలాంగులకు హాస్టల్స్ ప్రభుత్వమే నిర్వహించాల న్నారు. వికలాంగులకు విద్య బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల నిర్వాహకుల కోరిక మేరకు వికలాంగ హాస్టల్ రోడ్డును అభివృద్ధి చేస్తామని, రెండు వీధి దీపాలు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వికలాంగులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తిలకించి బహుమతులు అందజేశారు. అనంతరం సర్పంచ్ సొంత ఖర్చులతో వికలాంగులకు, తల్లిదండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, సంకుకొండ మదన గోపాలస్వామివారి దేవస్థాన కమిటీ చైర్మన్ మద్దు గోపాలకృష్ణ, వార్డు సభ్యులు ఏలేటి భాస్కర్, టెలిఫోన్ శేఖర్, స్కూల్ టీచర్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-కైకలూరు : గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక వెల్నెస్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని కైకలూరు శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరు మండలంలోని ఆచవరం గ్రామంలో 17.50 లక్షలు రూపాయలు నిధులతో నూతన వై ఎస్ ఆర్ వెల్ నెస్ సెంటర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనయులు శ్యామ్ ఫణి కుమార్,ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జంపన కొండరాజు,సర్పంచ్ కట్టా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - చింతలపూడి రూరల్ : ప్రగడవరంలో దళిత వర్గానికి చెందిన బేతి మహాలక్ష్మిని, అదే గ్రామంలో అడ్డగించి వైయస్సార్ పార్టీకి చెందిన శీలంపు రెడ్డి రమేష్ రెడ్డి, అతని అనుచరులు నలుగురు వ్యక్తులు విచక్షణారహితంగా కొట్టారని వీరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలాగా రవికుమార్ డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహాలక్ష్మిని రవికుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి కాపుదాసి రవికుమార్, సరిపల్లి పెద్దిరాజు,దళిత నాయకులు ధార వీరేంద్ర, గడదేసి ఏసు, కొమ్ము తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో కీలకమని అది వజ్ర ఆయుధం లాంటిదని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం. ఝాన్సీ రాణి అన్నారు. శనివారం దర్భ గూడెం ,జీలుగుమిల్లి, పి రాజవరం పోలింగ్ బూత్ లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశం శనివారం, ఆదివారం రోజులలో పోలింగ్ బూత్ ల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. కొత్త ఓటర్ నమోదు, తొలగింపు నివాసం మార్పు, చేర్పులు సవరణలు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులకు ఆధార్ కార్డును అనుసంధానం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి తాసిల్దారు గద్దం ఎలీషా, జీలుగుమిల్లి సచివాలయ కార్యదర్శి టి లక్ష్మీ ప్రసన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ కన్నయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కస్తూరి, జీలుగుమిల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ రామారావు, ఉపాధ్యాయులు బి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్.ఎలిజా అన్నారు. శనివారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామం లోని సచివాలయం వద్ద జగనన్న శాశ్వత భూ పథకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్.హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళల చిరకాల కోరిక అయిన సొంత ఇంటి కల కేవలం వైసీపీ ప్రభుత్వం లోనే నెరవేరుతుందన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ కోట్ల రూపాయలను ప్రభుత్వం నుంచి తీసుకువస్తూ అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే ఎలిజా పై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అనంతరం జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను మహిళలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఝాన్సీ రాణి , తహశీల్దార్ కే స్లీవ జోజి,ఎంపిపి కొదమ జ్యోతి,వైసీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు,వైసీపీ సర్పంచులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ ఒకరి సొంతం కాదు

(నేడు ప్రపంచ దివ్యాంగుల (విభిన్న ప్రతిభా వంతుల)దినోత్సవం)

విశాలాంధ్ర-చాగల్లు : సాధారణంగా అంగ వైకల్యం రెండు రకాలుగా వుంటుంది. మొదటిది పుట్టుకతో జన్యుపరంగా వచ్చే అవయవ లోపం కాగా,రెండవది ఏదైనా ప్రమాదం జరిగితే అవయవాలు కోల్పోవడం.ఇటువంటి వారు కాకుండా మానసిక వికలాంగులు కూడా వుంటారు. ఇంకా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడు తున్నవారు మరికొందరు వుంటారు. అన్నిరకాలుగా ఆరోగ్యంగా ఉండి.. అవకాశాలు, సౌకర్యాలు ఉన్న వ్యక్తి విజయం సాధిస్తే అది అంత చెప్పుకోవాల్సిన అంశం కాదు.. కానీ వైకల్యంతో అవరోధాలను, అసౌకర్యాలను ఎదుర్కొంటూ.. జీవన సోపానాలుగా మలుచుకోవడమే విశేషం. అలాంటివారు చరిత్రలో నిలిచిపోవడమే కాదు.. ఎందరికో స్ఫూర్తినిస్తారు. నాటి ఐన్‌స్టీన్, న్యూటన్, థామస్ అల్వా ఎడిసన్ ,లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హాకింగ్ నుంచి నేటి నిక్ ఉయిచిచ్, ఇరా సింఘాల్, సుధా చంద్రన్, తంగవేలు, ప్రాంజల్ పాటిల్,నూతన ప్రసాద్ ఇలా ఎవరి జీవితాన్ని తీసుకున్నా స్ఫూర్తిదాయకమే. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్3న వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి.ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది విభిన్న ప్రతిభా వంతులు వివిధ రంగాలలో అద్భుతంగా రాణిస్తున్నారు. తమిళనాడుకు చెందిన తంగవేలు ఐదేళ్ల వయస్సులోనే బస్సు ప్రమాదంలో అతను ఒక కాలు పోగొట్టుకున్నాడు. ఒంటరి మహిళ అయిన తల్లికి చిన్నప్పటి నుంచే చేదోడు వాదోడుగా ఉన్నాడు. 2016లో రియోలో జరిగిన పారా ఒలింపిక్స్‌లో ఫైనల్లో 1.89 మీటర్లు ఎత్తు ఎగిరి, హై జంప్‌లో బంగారు పతకాన్ని సాధించాడు. కృత్రిమ కాలుతోనే క్రీడల్లో రాణిస్తూ ప్రపంచం మెచ్చే క్రీడాకారునిగా ఎదిగాడు.కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కుపోయిన మనిషి, మాట్లాడటానికి కంప్యూటర్ సహాయం.. మోతార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా.. చేస్తున్న పనికి శరీరం సహకరించకపోయినా స్టీఫెన్ హాకింగ్ కృష్ణ బిలాలపై చేసిన పరిశోధనలు ఖగోళ శాస్త్రంలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను చూపాయి. శాస్త్రవేత్తగానే కాక ఆయనపై ఆయనకున్న నమ్మకం, ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకునే తత్వం అందరికీ ఆదర్శం. సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్తగా పేరుగాంచిన ఆయన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ఆచార్యునిగా విశేష సేవలందించారు. రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌లో గౌరవ సభ్యుడిగా, పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవితకాల సభ్యునిగా పనిచేశారు. అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకున్నారు. ఆయన 2018, మార్చి 14న మనందరికీ భౌతికంగా దూరమయ్యారు.ఇంకా ఇలా ఎందరో తమ అంగ వైకల్యాన్ని అధిగమించి, వివిధ రంగాల్లో రాణిస్తున్నారు.ప్రతి ఒక్కరిలో కుల,మతాలకతీతంగా ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. అలాగని అందరూ మేధావులు ఉండరు . అంగవికలురూ ఇతరులవలెనే అనేక పనులు సక్రమంగా చేయగలరని నిరూపణ చేస్తూనే ఉన్నారు. తెలివికి,తెలివిలేని తనానికి అంగవైకల్యానికీ సంబంధంలేదు.ఒకపని చేయగలగడం, చేయలేకపోవడం అనేవి వ్యక్తుల సామర్థ్యం మీద,ఆధారపడి ఉంటుంది తప్ప మరోటికాదు. మనం చేయగలిగినది ఎవరైనా చేయలేక పోతే మనం వాళ్ల కన్నా గొప్ప వాళ్ళం అనుకోవడం సర్వసాధారణమై పోయింది. వికలాంగులు దేంట్లోనూ తీసుపోరు. వారి ప్రతిభ అనూహ్యమైనది. అందుకే వారిని విభిన్న ప్రతిభావంతులు అంటున్నాం.ప్రస్తుతం మనం 'వికలాంగులు 'అనే పదం వాడటం లేదు.వారిని దివ్యాంగులు లేదా విభిన్న ప్రతిభావంతులు అని పిలుస్తారు.అన్నీవయవాలూ సరిగా ఉండీ శ్రమచేయగల శక్తి సామర్థ్యాలుండీ సోమరిగా ఉండే వారే అసలైన వికలాంగులనవచ్చని చెప్పవచ్చు. అందుకని ముందు మనలో ఉన్న ఇలాంటి అంగవైకల్యాన్ని మనంతట మనం చక్కబరచుకుని, మన అంగవైకల్యానికి ముందు వైద్యం చేయించుకుని ఆతర్వాత, ఆ అంగ వికలురకు చేయకలిగిన సేవ, సహాయం వారి పట్ల మన బాధ్యతగురించీఆలోచించాలి.

పుట్టుకతో వికలాంగులైనవారికి ప్రత్యేకమైన శక్తులుంటాయనే విషయమూ సత్యదూరంకాదు. మనంకూడా దివ్యాంగులకు చేయూతనిద్దాం. వారికి మనవంతు సహకారాన్ని అందిద్దాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యలకు అధికారులు పరిష్కార మార్గం చూపాలని కొయ్యలగూడెం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గంజిమల రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామా రావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులతో, ఎంపీటీసీలతో, సర్పంచ్లతో, మండలంలో అన్ని గ్రామాలలో ప్రజా సమస్యలపై చర్చించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా పనిచేస్తున్నారని ప్రతి ఒక్కరూ ప్రజా సమస్యలపై స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం

విశాలాంధ్ర - దేవరపల్లి : ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కృష్ణంపాలెం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రాపాక ఝాన్సీ పాఠశాల నుండి ఇంటికి వస్తూ ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నది. స్థానిక ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.5 లక్షల చెక్కును శనివారం గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జి. వి) కృష్ణంపాలెం ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్ రెడ్డి ల చేతుల మీదుగా ఝాన్సీ కుటుంబ సభ్యులకు అందజేశారు.

శ్రీ చైతన్య విద్యార్థి బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్ శ్రీ చైతన్య పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కె.ప్రీతి సత్య శివాని బ్యాడ్మింటన్ లో తన సత్తా చాటిం దని పాఠ శాల ప్రధానోపాధ్యాయు రాలు శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక అభినందన సభలో విద్యార్థినిని, తల్లిదండ్రులను శ్రీచైతన్య విద్యాసంస్థల రీజినల్ ఇన్‌చార్జి సుంకర పార్థసారథి, జోనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయ భాస్కర్, జోనల్ ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర - గోపాలపురం : అర్హులైన ప్రతి ఒక్కరికి పౌర సేవలు అందించేందుకే సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే తలారి వెంకటరావు తెలిపారు. శనివారం మండలంలోని వాదాలకుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయము, వెల్నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పిటిసి సభ్యురాలు కాకులుపాటి లలిత, సర్పంచ్ జొన్నకూటి మణెమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పౌర సేవలు సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజలు గ్రామ సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఉండవల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపిడిఓ ఆర్. శ్రీదేవి, తహశీల్దార్ రవీంద్ర నాథ్, ఎంపీటీసీ మరపట్ల వీర్రాజు, ఉప సర్పంచ్ వల్లభనేని ఝాన్సీ సత్యనారాయణ, యస్ కె ఖాధర్ వల్లి, వైకాపా నాయకులు గెడ అమ్మన్న బాబు, వై. ఏడుకొండలు, సోమశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని జిల్లా సహకార శాఖ అధికారి, కిర్లంపూడి మండలం ప్రత్యేక అధికారి దుర్గా ప్రసాద్ లబ్ధిదారులను ఉద్దేశించి అన్నారు. శనివారం కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో జగనన్న గృహనిర్మాణ లబ్ధిదారులకు అందించిన స్థలాలను గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించడమే కాకుండా లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇల్లు లేని ప్రతి పేదవానికి గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి సతీష్ బాబు, గృహ నిర్మాణ శాఖ డిఇ జి రాజ్ కుమార్, ఎఇ జివివి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నూకరాజు, గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ గంగారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఉన్నారు.

హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని నిరసన

విశాలాంధ్ర-చాగల్లు: మండల కేంద్రం చాగల్లు శివారు ఉన్న బేవరేజ్ డిపో వద్ద హమాలీ కార్మికులు ఎగుమతి రేట్లు పెంచాలని శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చాగల్లు ఏపీ ఎస్ బి సి ఎల్ హమాలి యూనియన్ నాయకుడు చింతలపూడి నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 29 బేవరేజ్ డిపోలలో పనిచేస్తున్న హమాలీ కార్మికుల ఎగుమతి రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఐదు రోజులుగా వివిధ రూపాలలో నిరసనలు తెలియజేస్తున్నామన్నారు. సిగ్మా కంపెనీ వారితో ఎగుమతి రేటు 2021 అక్టోబరు తో పూర్తయిందని దాదాపు 13 నెలలు పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన రేట్ల తో నిత్యవసర వస్తువులు కొనలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ఏపీఎస్ బీసీఎల్ యాజమాన్యం స్పందించి ప్రస్తుతం ఏడు రూపాయలు ఉన్న ఎగుమతి కూలీని పది రూపాయలు పెంచాలని అన్నారు. డిసెంబర్ 10వ తేదీ లోపుగా యాజమాన్యం సిగ్మా కంపెనీ వారితో మరియు కార్మిక ఐక్య పోరాటం జేఏసీతో సంప్రదింపులు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని అన్ని డిపోలలో ఈనెల 10వ తేదీ తర్వాత ఆందోళన కార్యక్రమాలు చేపడుతూ సమ్మెకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సాగల్లు డిపో హమాలీ నాయకులు మరియు హమాలీలు పాల్గొన్నారు.

లక్షపత్రి పూజ

విశాలాంధ్ర- చాగల్లు : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలం చాగల్లు శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం 26వ వార్షికోత్సవం సందర్భంగా లక్ష పత్రి పూజను భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు లింగాల శ్రీనివాస్ శర్మ బృందంచే లక్ష పత్రి పూజను ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభించారు. అనంతరం గణపతి పూజ మహన్యాసము సుబ్రహ్మణ్యస్వామి హెూమము జ్యోతిర్లింగార్చన కుంకుమ పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కేతాసాహెబ్ శ్రీలత దంపతులు పీట్లపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు గ్రామంలోని సుమారు 100 మంది లక్షపత్రి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు.

గృహనిర్మాణ దినోత్సవం



విశాలాంధ్ర - తాళ్ళపూడి : గృహ నిర్మాణ దినోత్సవ సందర్భంగా పెద్దేవం గ్రామంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు అధ్యక్షతన లేఔట్ లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఇల్లు నిర్మాణాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో వైకాపా నాయకులు తోట రామ కృష్ణ ఎంపీడీవో రాజశేఖర్,ఎం పి పి జొన్నకూటి పోసిరాజు, హౌసింగ్ ఏఈ, డి ఈ , పంచాయతీ కార్యదర్శి సువర్చల, వార్డ్ మెంబర్లు మైలవరపు రాధాకృష్ణ, పట్టపు స్వర్ణ కుమారి, కొయ్య మంగ, వైఎస్ఆర్ సీపీ నాయకులు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



విశాలాంధ్ర - గోపాలపురం : రక్షణ సేవా సమితి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. దైవజనులు ఫౌండర్ డైరెక్టర్ బ్రదర్ గద్దం సామ్యూల్ జాషువా హెూప్ మినిస్ట్రీస్ ఏపీపాస్టర్స్ అసోసియేషన్ జిల్లా రీజినల్ పాస్టర్. ఆర్. వి. ఎస్. కే. గోఫూర్, రక్షణ సేవ సమితి అధ్యక్షులు జి. ఎలీషా, గౌరవ అధ్యక్షులు ఎన్. ఏసేపు, సెక్రటరీ. టి. యేసు రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. 100 మంది పేదలకు దుప్పట్లను అందజేశారు. సేవకులు 60 మందికి వస్త్రాలు పంపిణీ చేశారు.

వైసీపీ పాలనలో ప్రజలకు ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - రాజానగరం : వైసీపీ పాలనలో దాదాపు 80 శాతం మంది ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ ఇదేం ఖర్మ అంటున్నారని నియోజకవర్గ ఇంచార్జి పెందుర్తి వెంకటేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మండలంలోని సీతారాంపురం గ్రామంలో నియోజకవర్గ ఇంచార్జి పెందుర్తి వెంకటేష్ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికి పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగిశెట్టి చంటిబాబు, నూనె వెంకన్న, కొల్లం రత్నం, చిట్టిప్రోలు పద్దరాజు, మద్దిరెడ్డి రాంబాబు, దొండపాటి లాజర్, మింగి లక్ష్మీనారాయణ, వీధి జాను, పిల్లా సత్తిబాబు, మునసా అప్పారావు, దూది కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత

విశాలాంధ్ర- చాగల్లు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలో విద్యా వైద్య రంగాలకు అత్యం త ప్రాధాన్యత నిస్తున్నారని -రాష్ట్ర హోం మంత్రి డా.తానేటి వనిత అన్నారు.గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి తానేటి వనిత చాగల్లు మండలం ఊనగట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద వర్గాల ప్రజల అభి వృద్ధి లక్ష్యంగా సంక్షేమ ఫలాల ను అర్హులైన ప్రతి ఒక్కరికి అం దిస్తున్నామ న్నారు. నియోజకవర్గం లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు - నేడు పథకం ద్వారా మౌళిక వసతు లు కల్పించి ఆధునీకరించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టా వెంకట్రావు వైస్ ఎంపీపీ జె.రామచంద్రరావు, ఆత్కూరి దొరయ్య, గూడపాటి శివ, కొవ్వూరు నియోజక వర్గం బండి అబ్బులు, ముదునూరు నాగరాజు, పోసిన శ్రీకృష్ణదేవరాయులు, తోట రామకృష్ణ, గౌడ్ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాత కృష్ణారావు, గ్రామ సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు సచివాలయ సిబ్బంది వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు దళ సభ్యుల లొంగుబాటు

విశాలాంధ్ర-ఎటపాక : ఇద్దరు మావోయిస్టు దళ సభ్యులు స్టేషన్‌లో లొంగి పోయినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. శనివారం ఎటపాక పోలీస్ స్టేషన్ లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం సుకుమ జిల్లా, చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని పడిమేరు గ్రామానికి చెందిన మడివి శంకర్ అలియాస్ సోమిదాల్, ఇతను 2013 డిసెంబర్ నెలలో పెదనాన్న అలియాస్ అప్పారావు పోలంపల్లిలో లాస్ పెరుదచ్చా చంలో కమాండర్ పార్టీలో చేరి పాల్గొన్నారని తెలిపారు. కుసుమ జిల్లా కుంట మండలం బెజ్జిగ్ రామ్ గల గుత్తికోయా తెగకు చెందిన మావోయిస్టు డిఫుటి కామెండర్ పనిచేసిందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓఎస్డి కృష్ణకాంత్ (ఐపిఎస్), చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి (ఐపిఎస్), సీఐలు, ఎస్సైలు , సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 3 డిసెంబరు, 2022వ తేదీన కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రోటరాక్ట్ క్లబ్ వారి సంయుక్త నిర్వహణలో రక్తదాన శిబిరం నిర్వహించి కాకినాడ గవర్నమెంట్ హాస్పటల్ వారికి అందజేసారు. ఈ కార్యక్రమం డాక్టర్ డి. శారదా దేవి బ్లడ్ బ్యాంక్ యూనిట్ ఇన్‌చార్జి జిజిహెచ్, కాకినాడ వారి పర్యవేక్షణలో కొనసాగింది. ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పి. కృష్ణారావు మాట్లాడుతూ తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి రోటరాక్ట్ క్లబ్ వారు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తులో చేపట్టే వివిధ సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం 100 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించిన అనంతరం 73 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నుండి రక్తమును సేకరించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరక్టర్ డా ఎస్ శంభుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : 18 సంవత్సరములు గల ప్రతీ ఒక్కరూ ఓటరు గా నమోదు అవ్వాలని తాళ్లపూడి తహసిల్దార్ రాధిక తెలిపారు. శనివారం మరియు ఆదివారం ఓటర్ల సంక్షిప్త కార్యక్రమము మండలంలో జరుగుతున్నదని స్త్రీ, పురుష బేధం లేకుండా నమోదు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జోడాల వేంకటేశ్వర రావు తాడిపూడి,ప్రక్కిలంక,పైడిమెట్ట,గజ్జరం,పోచవరం గ్రామాలలో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ప్రక్కిలంక పైడిమెట్ట ఐ.టి.ఐ కళాశాలలో ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించినట్లు ఎక్కువ మంది నమోదు అయ్యారని అన్నారు..ఆర్.ఐ క్రాంతి రేఖ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, జూనియర్ సహాయకులు మధు , బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గోపాలపురం : మహిళలపై లైంగిక వేధింపులు లింగ వివక్షత విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని, సి డిపిఓ వైబిటి సుందరి సూచించారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు, సిడిపిఓ వైబిటి సుందరి మాట్లాడుతూ గృహహింస, దిశ యాప్, వరకట్నం వేధింపుల పై, యాసిడ్ దాడులు, పై.అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలిగి దాడులను ధైర్యంగా తమకు సంక్రమించిన హక్కులను సాధించుకోవడంలో వెనుకంజ వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నకూటి మనేమ్మ, స్కూల్ హెచ్ఎం విజయ్ కుమార్,మోహనరావు, సూపర్వైజర్ కే సుశీల, జేవి రమణ, వెంకటలక్ష్మి ,కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు ఎంఈఓ కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ వై. సుబ్బారావు, ఎంపీపీ సత్య భీమేశ్వర్ పాల్గొని దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేశారన్నారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయించుట జరుగుతుందని దివ్యాంగులను సాధారణ స్థితికి తీసుకువచ్చి మెరుగైన విద్యను అందించుట జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు ఎంఏ అలీమ్, రవికుమార్, ఐఇఆర్‌పి టీచర్ కన్నె స్వాతి రాజు, సారాకుమారి, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాధన హైస్కూలు వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక తిలక్‌రోడ్‌లోని సాధన హైస్కూలు వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్వీ మాధవరావు మాట్లాడుతూ దివంగత సలాది ముత్యాలరాయుడు మధ్యతరగతి ప్రజలకు చెందిన పిల్లలకు విద్యనందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందించడం తమ పాఠశాల లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీచేశారు.

జయహో బీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర - అంబాజీపేట : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న జయహో బీసీ మహాసభ విజయవంతం కావాలని కోరుతూ పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల వైకాపా అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబులతో కలిసి శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు ఎంఎం శెట్టి, దొమ్మేటి శ్రీను, రాయుడు కృష్ణ మహేష్, కుడుపూడి సత్తిబాబు, పితాని శెట్టి, చెల్లిబోయిన శ్రీను, కుడిపూడి సతీష్, వాసంశెట్టి వెంకన్న, ర్యాలీ శ్రీనివాస వడియార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-వి. ఆర్. పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రేకపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు సౌకర్యం కల్పించడమే తన లక్ష్యమని ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనేం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి పేర్కొన్నారు.. రేఖపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపిడిఓ ఆఫీస్ పరిధిలో సుమారు 700 మీరటర్ల పొడవునా పైపు లైనుకు ఎంపీపీ కారం లక్ష్మీ స్థానిక సర్పంచ్ పూనేం సరోజిని భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రతీ ఇంటికి ట్యాప్ ల ద్వారా నీటి సౌకర్యం కల్పించడం జరుగు తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పూ నేం సత్యనారాయణ పంకు సత్తిబాబు నల్లారపు ప్రకాష్ రావు సిరపు తాతబాబు రెడ్డి, ఆర్. డబ్ల్యు.ఎస్.సాయి రామ్ ప్రసాద్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరుణ్ సచివాలయం సెక్రటరీ శివప్రసాద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.